క్లుప్తంగా

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు


వాగులో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్

కోరుట్ల: పట్టణంలో వినాయకుని నిమజ్జనోత్సవం మంగళవారం జరుగనుంది. ఈ మేరకు నిమజ్జనం జరిగే ప్రదేశాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్లను కమిషనర్ బట్టు తిరుపతి ఆదివారం పరిశీలించారు. బతుకమ్మ వాగు, కంచరకుంట, యెఖీన్‌పూర్ వాగులో విద్యుత్ లైట్లు అమర్చి నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నిర్వాహకులు వారికి కేటాయించిన నంబర్ల ప్రకారం జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌కు చేరుకోవాలని, సమయపాలన పాటించి సహకరించాలని కమిషనర్ కోరారు.

వట్టివాగు వద్ద ఏర్పాట్లు పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

మెట్‌పల్లి: పట్టణంలో సోమవారం జరిగే వినాయక నిమజ్జనం సందర్భంగా వట్టివాగు వద్ద చేస్తున్న ఏర్పాట్లను ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు. మండపాల నిర్వాహకులకు, నిమజ్జనాన్ని తిలకించడానికి వచ్చే ప్రజలకు వాగు వద్ద అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ మోహన్, డీఈ నాగేశ్వర్‌రావు, ఏఈ తిరుపతి, టీపీవో రాజేంద్రప్రసాద్ తదితరులున్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన


వైద్య శిబిరంలో వైద్యులు,లయన్స్‌క్లబ్ సభ్యులు

కథలాపూర్: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మండలకేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో ఫిజిషియన్, పిల్లల, కీళ్ల, ఎముకల వైద్యులు ప్రజలకు చికిత్సలందించారు. 300 మందికి చికిత్సలందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జ్వరాల బారిన పడుతున్నవారికి కీళ్ల నొప్పులు అధికమవుతున్నాయని పలువురు వైద్యులతో గోడు వెల్లబోసుకున్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ జెడ్పీటీసీ నాగం భూమయ్య, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు సంజీవ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సతీశ్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, పరమేశ్వర్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై రాజీలేని పోరాటం

కోరుట్ల రూరల్: పెన్షనర్ల సమస్యల కోసం రాజీలేని పోరాటం చేస్తామని టీ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ అన్నారు. పట్టణంలో ఆదివారం మాట్లాడుతూ పదేళ్లుగా పెండింగ్ ఉన్న సమస్యల పరిష్కారానికి టీ ఉద్యోగుల జేఏసీ అనుబంధ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య ఆధ్వర్యంలో కలిసికట్టుగా ఉద్యమిస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగుల, పెన్షనర్ల స్నేహపూర్వక ప్రభుత్వమని చెప్పుకుని ఉద్యోగులు, పెన్షనర్ల సంఘాలను నిర్వీర్యం చేసిందన్నారు. కార్యక్రమంలో కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు పబ్బా శివానందం, గంటేడి రాజ్ మోహన్, ఎండీ సైఫొద్దీన్, లక్ష్మీనారాయణ, రాజయ్య, గంగారాం, శ్రీరాములు, మల్కయ్య, స్వామి డివిజన్‌లోని వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు పతకాలు

కోరుట్ల రూరల్: పట్టణంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాల విద్యార్థులు మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో 50 పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ సుధాకర్ ఆదివారం తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి గురుకులానికి 50 పతకాలు తీసుకువచ్చారని పేర్కొన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను పలువురు అభినందించారు.


మల్లాపూర్‌లో కుంకుమ పూజ చేస్తున్న మహిళలు


వెల్లుల ఆదర్శ యూత్ వినాయకుని వద్ద కుంకుమ పూజ


ధర్మపురిలో ఆర్యవైశ్య మహిళల పూజలు

గణనాథులకు ప్రత్యేక పూజలు,అన్నదానాలు

జగిత్యాలటౌన్/కోరుట్ల/మెట్‌పల్లిరూరల్/ధర్మపురి/రాయికల్/మల్యాల/పెగడపల్లి/సారంగాపూర్/మల్లాపూర్: జిల్లా వ్యాప్తంగా మండపాల్లో ఏర్పాటు చేసిన గణనాథులకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండపాల వద్ద అన్న ప్రసాదాలు ఏర్పాటు చేయగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. వివిధ రకాల నైవేద్యాలు వినాయకుడికి సమర్పించారు. మహిళలు భక్తి శ్రద్ధలతో కుంకుమపూజల్లో పాల్గొన్నారు. కొన్ని గ్రామాల్లో వినాయకులను నిమజ్జనం చేశారు.


రాయికల్ లో 108 రకాల నైవేద్యాలు


పెగడపల్లి : రాజారాంపల్లిలో శ్రీగణేశ్ యూత్ సభ్యుల పూజలు


మంగేళలో అరిటాకులో అన్నదానం


చిట్టాపూర్‌లో 108 రకాల నైవేద్యాలు


గణేశ్ దీక్షా స్వాములకు అన్నదానం


జగిత్యాల శివవీధిలో నోట్లతో వినాయకుడికి అలంకరణ

ఉద్యోగాలు కల్పించాలని వినాయకుడికి వినతి


వినతిపత్రం ఇస్తున్న స్ట్రీట్ బాయ్స్ యూత్

జగిత్యాలటౌన్: గణేష్ నవరాత్రుల్లో భాగంగా జగిత్యాల పట్టణం విద్యానగర్ మైసమ్మగడ్డలో ద స్ట్రీట్‌బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన లంబోధరుడికి ప్రముఖ వ్యాపారి కొండా లక్ష్మణ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యూత్ సభ్యులు దీపారాధన చేసి ఉద్యోగాలు కల్పించాలని గణనాథుడికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కిట్టురెడ్డి,వంశీ, సురేందర్‌రెడ్డి, సమీర్, అజయ్,శ్యాంరెడ్డి, కొమురవెల్లి మణి, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వినాయకుడి లడ్డూ వేలం

రాయికల్: పట్టణంలోని సంఘమిత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుని వద్ద ఉన్న లడ్డూను ఆదివారం వేలం నిర్వహించారు. జిల్లాల నాగరాజు సుస్మిత దంపతులు రూ.32 వేలకు దక్కించుకున్నట్లు అధ్యక్షుడు పటేల్ శివారెడ్డి తెలిపారు.



ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం


తాండ్ర్యాలలో నిమజ్జనానికి తరలుతున్న గణేశుడు

రాయికల్: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వినాయకుని నిమజ్జనం ఘనంగా నిర్వహించారు.రాయికల్ లోని కేశవ్‌యూత్,సర్వాజన్ యూత్ సభ్యులు వినాయకుని శోభాయాత్ర సందర్భంగా ఏర్పాటు చెసిన లైట్ సెట్టింగ్ పట్టణ ప్రజలను ఆకట్టుకుంది.


రాయికల్‌లో ఆకట్టుకుంటున్న భారీ సెట్టింగ్

కథలాపూర్: మండలంలోని పపలు గ్రామాల్లో ఆదివారం రాత్రి వినాయక నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసి ఊరేగించారు. యువకులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం చెరువుల్లో నిమజ్జనం చేశారు.


నర్సింహులపల్లెలో నిమజ్జనం
నర్సింహులపల్లెలో ..

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లెలో వినాయక నిమజ్జనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వినాయక మండపంలో భక్తులు పూజలు నిర్వహించిన అనంతరం వినాయకుడిని నిమజ్జనానికి తరలించారు.

అధునాతన ఆస్పత్రి ఏర్పాటు అభినందనీయం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోరుట్ల: అధునాతన సౌకర్యాలతో ప్రపంచ స్థాయి వైద్య సౌకర్యాలతో కోరుట్లలో ఆస్పత్రి ఏర్పాటు చేయటం అభినందనీయమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.పట్టణంలో రెనే గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోరుట్లలో ఆస్పత్రిని ప్రభుత్వ విప్ ప్రారంభించారు. 50 పడకల ఈ ఆస్పత్రిలో అత్యాధునిక పరికరాలు, 20 క్రిటికల్ కేర్ పడకలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పలు విభాగాలను ఎమ్మెల్యేలు సంజయ్ కుమార్, కల్వకుంట్ల సంజయ్, కోరుట్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, ఐఎంఏ సీనియర్ నాయకుడు అనూప్ రావులు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, ఐఎంఏ వైద్యులు, వివిధ పార్టీల నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్

గణేశుని నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి

పెగడపల్లి: గణేశుని నిమజ్జన వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై సీహెచ్ రవికిరణ్ నిర్వాహకులకు సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు, నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. పెగడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం మాట్లాడారు. మద్యం సేవించి నిమజ్జనంలో పాల్గొనవద్దని ఎవ్వరైన మద్యం తాగి నిమజ్జనంలో పాల్గొని అల్లర్లు సృష్టిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అల్లర్లు జరిగితే నిర్వాహకులే బాధ్యత వహించాల్సి ఉంటుందని సూచించారు. అనుమతి లేకుండా డీజేలు వాడితే కేసులు నమోదు చేయడంతో పాటు వాటిని సీజ్ చేస్తామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఎస్సై కోరారు.

పీసీసీ అధ్యక్షుడికి జువ్వాడి శుభాకాంక్షలు

కోరుట్ల/మల్లాపూర్: టీపీసీసీ అధ్యక్షుడిగా ఆదివారం పదవీబాధ్యతలు స్వీకరించిన మహేష్ కుమార్ గౌడ్‌ను కోరుట్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు కలిశారు. మహేష్ కుమార్ గౌడ్‌ను శాలువా, పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ సారథ్యంలో ప్రతి గ్రామంలో అభివృద్ధితో పాటు 100 శాతం సంక్షేమ పథకాలు అందించమే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, సీనియర్ నాయకుడు డాక్టర్ జేఎన్ వెంకట్, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, మాజీ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, నల్ల బాపురెడ్డి, అంతడుపుల నర్సయ్య, అల్లూరి మహేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న నర్సింగరావు

బోరుబావి పనులు ప్రారంభం

కథలాపూర్: మండలకేంద్రంలో గ్రామైక్య మహిళా సంఘం భవనం వద్ద ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసే బోరుబావి పనులను ఆదివారం నాయకులు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. మహిళలకు నీటికి ఇబ్బంది ఉండవద్దని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు తిపిరెడ్డి అనంతరెడ్డి, వెలిచాల సత్యనారాయణ, న్యావనంది శేఖర్, నారాయణరెడ్డి, లింగారావు, నారాయణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే యాదవుల అభివృద్ధి

రాయికల్: రాజ్యాధికారంతోనే యాదవుల అభివృద్ధి చెందుతారని యాదవ సంఘం మండల అధ్యక్షుడు వాసరి రవియాదవ్ అన్నారు. మండల క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన యాదవుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాజ్యాధికారం ద్వారానే యాదవుల సమస్యలు పరిష్కారమై అభివృద్ధి చెందుతారన్నారు. యాదవులు విద్య,సామాజిక,ఆర్థిక రంగాలలో రాణించాలన్నారు. మండలంలోని కట్కాపూర్ గ్రామానికి చెందిన న్యాయవాది మాదం మల్లేశ్ యాదవ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాజేష్‌యాదవ్, యాదవ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల స్వామి యాదవ్, మండల యాదవ సంఘం గౌరవ అధ్యక్షుడు రెబ్బాస్ మల్లయ్య యాదవ్, మండల నాయకులు పాల్గొన్నారు.


న్యాయవాదిని సన్మానిస్తున్న నాయకులు

అనాథాశ్రమంలో అన్నదానం

మేడిపల్లి: మండలంలోని పోరుమల్ల గ్రామ యువసేన యూత్ సభ్యులు, భీమారం మండల కేంద్రంలోని లయన్స్‌క్లబ్ సభ్యులు ప్రతి ఏటా అనాథ ఆశ్రమంలో అన్నదానం నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది కూడా భగినీ నివేదిత, వాల్మీకి అనాథ ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు.

ఘనంగా ఇంజినీర్స్ డే

కోరుట్ల: పట్టణంలోని ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారతరత్న, ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినం సందర్భంగా ఆదివారం ఇంజనీర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఇంజనీర్లను సన్మానించారు. కార్యక్రమంలో బచ్చువాల సంజీవ్, రాజవర్ధన్, సాయికిరణ్, నరేశ్, నట్రాజ్, ప్రదీప్, సజీర్, హైమద్ పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న ఇంజనీర్లు

నిండుగా వరదకాలువ ప్రవాహం



మల్యాల: ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచి వరదకాలువకు నీటి విడుదలతో వరద కాలువకు ఇరువైపులా కాలువ అంచులు తాకుతూ ప్రవహిస్తోంది. రామన్నపేటలో వరదకాలువపై వంతెన వద్ద వంతెన అంచులను తాకుతూ ప్రవహిస్తోంది. వరదకాలువలోకి చేపల కోసం ఎవరూ వెళ్లవద్దని, నీటిపారుదల శాఖ అధికారులు సూచిస్తున్నారు.

పాడవుతున్నా.. పట్టించుకోరా?

జగిత్యాలటౌన్: ప్రజారోగ్య సంరక్షణ లక్ష్యంగా లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు ప్రజలకు నిరుపయోగంగా మారాయి. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లకు చిన్నచిన్న రిపేర్లు చేయని కారణంగా అవి పనికి రాకుండా పోతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బల్దియా అధికారులు నిర్లక్ష్యం వీడి ఓపెన్ జిమ్‌లకు మరమ్మతులు చేపట్టి ప్రజాధనం వృథా కాకుండా చూడటంతో పాటు ప్రజారోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.



ఈ సమస్యపై సంప్రదించాల్సిన అధికారి
సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల, సెల్ నం: 9849905877

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 94400 61630, 9705346643

తగ్గుముఖం పట్టిన విషజ్వరాలు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలోని గ్రామాల్లో విషజ్వరాలు తగ్గుముఖం పడుతున్నాయి. రెండు నెలల కిందట జిల్లాలో ఎక్కడ లేని విధంగా ఇక్కడి గ్రామాల్లో విషజ్వరాలు విజృంభించాయి. మలేరియా,డెంగీ,చికున్ గున్యా లాంటి లక్షణాలతో ఎంతో మంది మంచాన పడ్డారు. ముఖ్యంగా జగ్గాసాగర్, ఆత్మనగర్ గ్రామాల్లో ఇంటింటికీ ఇద్దరి నుంచి ముగ్గురు జ్వరాల బారిన పడ్డారు.ఆ సమయంలో మెట్‌పల్లి మండలం వైద్యాధికారి అంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో జగ్గాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్యులు,సిబ్బంది ఇంటింటికీ జ్వర సర్వే నిర్వహించారు. ఎప్పటికప్పుడు జ్వర పీడితులపై ప్రత్యేక దృష్టి సారించి చికిత్స అందజేశారు.మరోవైపు డెంగీ కేసులు జూలైలో 4, ఆగస్టులో 9, సెప్టెంబర్ మొదట్లో ఒక కేసు నమోదు కాగా ప్రస్తుతానికి జీరోగా ఉన్నాయి. అంతేకాకుండా వైరల్ జ్వరాలు సైతం పూర్తిస్థాయిలో అదుపులోకి వచ్చాయి. కొద్ది రోజుల క్రితం హౌస్, బ్రూట్, కంటైనర్ ఇండెక్స్‌లు 90 శాతానికికు పైగా ఉండేది. ప్రస్తుతానికి సాధారణ స్థితికి వచ్చాయి. ఆదివారం నాటికి హౌస్ ఇండెక్స్ 4.5, బ్రూట ఇండెక్స్ 14,కంటెనర్ ఇండెక్స్ 8.5 శాతంగా ఉన్నాయి. మొత్తంగా జ్వరాలు తగ్గుముఖంతో నిరంతరం శ్రమించిన వైద్య సిబ్బంది, ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు.


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు(ఫైల్)

పాత గొడవలు మనసులో పెట్టుకుని దాడి

సారంగాపూర్: మండలంలోని రేచపల్లిలో పాత గొడవలు మనసులో పెట్టుకుని దాడి చేయడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం రేచపల్లికి చెందిన మహేందర్‌ను అదే గ్రామానికి చెందిన మహేశ్ అనే వ్యక్తి పాత గొడవలు మనసులో పెట్టుకుని ఖాళీ బీర్ సీసాతో మహేందర్ తలపై దాడిచేయడంతో మహేందర్‌కు గాయాలయ్యాయి. మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.